క్లుప్తంగా

పీహెచ్‌సీకి సామగ్రి వితరణ



సామగ్రి అందిస్తున్న అన్నపూర్ణమ్మ కుటుంబ సభ్యులు

ఉప్పలగుప్తం: స్థానిక పీహెచ్‌సీలో రోగుల అవసరాల నిమిత్తం మట్టపర్తి అన్నపూర్ణమ్మ సహకారంతో వారి కుమారులు ఉమామహేశ్వరరావు, నాగేంద్రప్రసాద్ పలు సామగ్రిని సమకూర్చారు. ఒక వీల్‌చైర్, ఫోల్డింగ్ మంచం, 12 బెడ్‌షీట్లను వైద్యాధికారి ఎల్.నాగార్జునకు అందించారు. సీహెచ్‌వో ఎం.విజయలక్ష్మి, వి.జ్యోతి, దొమ్మేటి రమేష్, కేజీవీ కుమార్ ఉన్నారు.

బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు హేమంత్



వీరమల్లు హేమంత్

అమలాపురం టౌన్: నూజివీడులో ఈ నెల 3, 4, 5 తేదీల్లో రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ అండర్–14 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ జట్టుకు స్థానిక విద్యానిధి స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి వీరమల్లు హేమంత్ ఎంపికయ్యాడు. హేమంత్ తండ్రి వీరమల్లు నరసింహరావు అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీగా పని చేస్తున్నారు. బుధవారం పాఠశాలలో హేమంత్‌ను ఆ విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, కరస్పాండెంట్ ఆకుల శ్యామల మహాలక్ష్మి, ప్రిన్సిపాల్ టీఎస్ మాధవి, పీజే ఆంటోని, ఉపాధ్యాయులు అభినందించారు.

శివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరించిన కమిటీ సభ్యులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ జరిగే శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాలను పురస్కరించుకొని పందిరి రాటకు ప్రత్యేక పూజలు చేసి మూహూర్తం చేశారు. ఆలయ ప్రాంగాణంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అరిగెల నానాజీ, సుంకర బుజ్జి, మద్దింశెట్టి శివయ్య, సలాది శివాజీ, అడబాల సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అనురాధకు ఆహ్వానం

అల్లవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, శిక్షణ శాఖ సీడప్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు హాజరుకావాలని ఎంపీ చింతా అనురాధను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ ఆహ్వానించారు. ఈ మేరకు మొగళ్లమూరులో బుధవారం ఎంపీని కలిసి ఆహ్వాన పత్రం అందించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ జాబ్ మేళా గురించి వివరించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వెంకట సత్యనారాయణ సోదరులు, చిత్రంలో ఎంపీ అనురాధ

అల్లవరం: మొగళ్లమూరు సెంటర్‌లో కొలువైన శ్రీలక్ష్మీగణపతి నూతన ఆలయ నిర్మాణానికి కాండ్రేగుల వెంకట సత్యనారాయణ, జవహర్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు దంపతులచే బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ చింతా అనురాధ ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామస్తుల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ రాయుడు విష్ణు, గుంటూరి బాలరాజు, కొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులకు ...

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి బొండాడిపేటలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు బుధవారం శంకుస్థాపన చేశారు. స్కూల్ ఆధునీకరణం నిమిత్తం రూ.20 లక్షలు కేటాయించి, 10 రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు జెడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, ఎంపీటీసీ సభ్యురాలు వరసాల వెంకటలక్ష్మి, గుమ్మళ్ల రమణ, ఇసుకపట్ల రఘుబాబు, హెచ్ఎం ఎం.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కనకాలపేట ఏటిగట్టుపై బారికేడ్లు

యానాం: యానాం–కనకాలపేట ఏటిగట్టు దారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో పోలీసు అధికారులు స్పందించారు. బుధవారం తెల్లవారుజామున కనకాలపేట ఏటిగట్టు దారిపై సీఐ గూటం శివగణేష్ ఆధ్వర్యంలో బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఎస్సైలు కట్టా సుబ్బరాజు, జేఎస్సై జిల్లెళ్ల ప్రభాకర్, హెడ్‌కానిస్టేబుల్‌లు కోన సుబ్రహ్మణ్యం, పీవీవీ రమణ, గ్రామపెద్దలు కోన సూరిబాబు, కోన సుబ్బారావు పాల్గొన్నారు.

కలుపు కలవరం

- వరిలో విస్తరిస్తున్న వైనం
- తొలగింపులో నిమగ్నమైన రైతులు



గాడిలంకలో వరి చేలలో కలుపు మొక్కలు తొలగిస్తున్న రైతులు

ముమ్మిడివరం: వరిలో కలుపు రైతులను కలవరపెడుతోంది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలలో సుమారు 72 వేల ఎకరాలలో రబీ సాగు చేస్తున్నారు. వీటిలో 70 శాతం మంది వరినాట్లు వేయగా మిగిలినది వెదజల్లే పద్ధతిని అవలంబించారు. వెదజల్లే పద్ధతిలో కలుపు ఎక్కువగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది కూలీలను పెట్టి కలుపును తొలగిస్తున్నారు. ఎకరాకు కలుపు తీయడానికి సుమారు రూ.2వేలు వరకు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. కలుపు తొలగించే క్రమంలో కూలీలు కలియ తిరగడం వల్ల మొక్కకు ఉన్న వేళ్లు తెగి కొత్త వేరుతో దుబ్బు బాగా చేస్తుందని అనుభవం గల రైతులు అంటున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండడంతో చేలలో కలుపు ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం

వరి మొక్కలతో కలుపు మొక్కలు అధికంగా పెరిగి భూసారాన్ని అధికంగా గ్రహిస్తాయని, వీటిని తొలగించాలని సూచిస్తున్నారు. ఖరీఫ్ తెగుళ్ల ప్రభావం అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రోజు చేల వద్దకు వెళ్లి రైతులు ఏ తెగులు ఉందో గమనించి నివారణా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమిస్తే అధిక దిగుబడికి ఢోకా ఉండదని వ్యవసాయాధికారులు అంటున్నారు.

కలుపును ఆదిలోనే నివారించాలి

వరి సాగులో కలుపు మొక్కలను గుర్తించి సకాలంలో సరైన మోతాదులో రసాయనిక మందులను వాడాలని ముమ్మిడివరం ఏఓ ఎస్.ప్రశాంతకుమార్ సూచించారు. నాట్లు వేసిన 15 రోజుల్లో వరిచేలలో పొలంలో నీరు పెట్టి 25 కిలోల పొడి ఇసుకలో ఒక లీటరు నుంచి 1.5 లీటర్ల బ్యూటాకోరో లేదా 500 మిల్లీలీటర్ల అనిలోఫాస్ లేదా ప్రెటిలాక్లోర్ కలిసి ఎకరం పొలంలో సమానంగా చల్లాలని సూచించారు. నాట్లు వేసిన 15 నుంచి 20 రోజులకు గడ్డి జాతీ మొక్కలున్నా 200 లీటర్ల నీటిలో 250 నుంచి 300 మిల్లీలీటర్లు సైహలో ఫాప్ బ్యూలైట్ (క్రించర్)కలిపి పిచ్చికారీ చేయాలన్నారు. నాట్లు 25 రోజులకు వెడల్పుకు మొక్కలున్నచో 200 లీటర్లు నీటిలో 500 గ్రాముల 2–4డీ సోడియం సాల్ట్ (ఫెర్నోక్సాన్)కలిపి పిచ్చికారీ చేయాలన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట ముహూర్తం చేస్తున్న ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకూ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ ఆవరణలో ఉదయం 8.47 గంటలకు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, ఆలయ పాలక మండలి సభ్యులు, భూమి పూజ చేసి పందిరి రాట నాటారు. ఆలయ అర్చకులు ఉండి దత్తు, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిప్రసాద్ తదితరుల పండితులచే వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, తెప్పోత్సవం తదితర ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాలకు జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కరోనా నిబంధనలు పాటిస్తూ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

యానాం దళిత గ్రామాల్లో సమస్యలపై ధర్నా



దళితగ్రామాల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

యానాం: నియోజకవర్గ పరిధిలో దళిత గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరి దళిత ఐక్యవేదిక పిలుపు మేరకు బుధవారం స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు సమీపంలో దళితులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. దళితులు మాట్లాడుతూ దొమ్మేటిపేట డ్రైనేజీలో వివిధ పరిశ్రమలు వదిలే వ్యర్థాలతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందుపడుతున్నామని, గతంలో రూ.35వేల గృహనిర్మాణ స్కీమ్‌ను రద్దు చేసి రూ.5లక్షల స్కీమ్‌ను అమలు చేయాలని, దరియాలతిప్ప ఐలాండ్–3లో 1993లో ఎస్సీలకు ఇచ్చిన భూములకు సరిహద్దులు నిర్ణయించకుండా 191 పట్టాలు ఇచ్చారని తక్షణం హద్దులు నిర్ధారణ చేయాలని కోరారు. పరంపేట గ్రామ ప్రాథమిక పాఠశాలకు క్రీడా స్థలం మంజూరు, కాలువ నుంచి వచ్చే నీటిని సరైన విధంగా శుద్ధి చేసి ఇచ్చేలా పిడబ్ల్యూడీ శాఖకు ఆదేశాలివ్వాలని, సొసైటీల్యాండ్‌లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, కోరుకొండ రాజేంద్రప్రసాద్, మట్టా శ్రీనివాస్, గుదే దుర్గాప్రసాద్, జనిపల్లి వెంకన్నబాబు, వడ్డిదాసు, బడుగు సూర్యప్రకాష్, పరంపేట, దొమ్మేటిపేట, దరియాలతిప్ప, అంబేడ్కర్‌నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చేనేత సహకార ప్రతినిధుల ప్రమాణ స్వీకారం



సంఘం సభ్యులను సత్కరించి, అభినందిస్తున్న గ్రామ పెద్దలు

అమలాపురం రూరల్: బండార్లంక దేవాంగ చేనేత సహకార సంఘం సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బండార్లంక గ్రామంలోని సంఘ కార్యాలయంలో సంఘం చైర్మన్‌గా చింతా ఉమామహేశ్వరరావు, సభ్యులుగా లక్కింశెట్టి భోగిరాజు, గోళ్ల భాస్కరరావు, బట్టు టాక్సీరామ్, చల్లా సత్యవతిలతో ఆ సంఘ కార్యదర్శి కరెళ్ల నాగరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, సంఘం మాజీ చైర్మన్ చందన శంకరరావు, గ్రామ పెద్దలు దంగేటి బుల్లబ్బులు, కాలెపు శ్రీనివాసరావు, సరెళ్ల మల్లేశ్వరరావు, భోజనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు సంఘం నూతన ప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటిపై ఊసెత్తకుండా రిక్త హస్తాలు చూపించిందని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల గిరిజన విశ్వ విద్యాలయాలకు గత ఏడాది బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో 15 శాతం నిధులు కోత విధించంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు వి.హరిబాబు, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా లోవరాజు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా భట్నవెల్లి గ్రామానికి చెందిన ర్యాలీ లోవరాజు ఎన్నికైయ్యారు. రావులపాలెం మండలం గోపాలపురంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గోపాలపురం నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ కంతేటి నాగవెంకట సుధీర్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా కాగితాపల్లి నరసింహారావు (మాస్టారు), జిల్లా ఉపాధ్యక్షులుగా పసులేటి రామకృష్ణ, కోడూరి శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రెటరీగా కంతేటి నాగ వెంకట సుధీర్, జిల్లా కోశాధికారిగా ముచ్చుపల్లి వీరవెంకట కనకదుర్గారావు, జిల్లా యువజన అధ్యక్షుడిగా మాచవరపు సూరిబాబు ఎన్నికైయ్యారు. రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి బైలపూడి రామకృష్ణ రాష్ట్ర నాయకులు ర్యాలీ పట్టాభి రామయ్య, రాష్ట్ర నాయకులు రామేశ్వరపు శ్రీనివాసరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చిట్టా బత్తుల నాగబాబు, రాష్ట్ర నాయకులు శిలారపు సత్తిబాబు అభినందించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: బీజేపీ ప్రభుత్వం అనుచరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వి.హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో బుధవారం జరిగిన సీఐటీయూ రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ఈనెల ఆరో తేదీ నుంచి బీజేపీ కేంద్ర ప్రభుత్వ విధానాలపై జిల్లా, మండల స్థాయి సదస్సులు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

వేణుగోపాల్‌కు సత్కారం

అమలాపురం టౌన్: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన ఆవుపాటి వేణుగోపాల్‌ను యువత నాయకులు స్థానిక దేవాంగుల వీధిలో బుధవారం ఘనంగా సత్కరించారు. అమలాపురం నియోజకవర్గ టీడీపీ యువత అధ్యక్షుడు గొలకోటి చిన్న, అల్లవరం మండల యువత అధ్యక్షుడు ముత్యాల బాబ్జీ ఆధ్వర్యంలో యువకుల బృందం వేణుగోపాల్‌ను సత్కరించింది.

వాసవీ మాతకు పూజలు

యానాం: వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ 17వ వార్షిక మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నాదస్వరం అనంతరం అభిషేకాలు నిర్వహించారు. వాసవీ అమ్మవారి అలంకరణ అనంతరం కాపంగంటి రాంప్రసాద్, వసంత దంపతులచే లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. వంకాయల సత్యప్రసన్నం, సరోజిని దంపతులచే గ్రామోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 300 రకాల భారీ సారెను పురవీధులలో ఊరేగిస్తూ వాసవీమాతకు సమర్పించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం చేశారు. అధ్యక్షుడు పులవర్తి శ్రీను, దేవస్థానం కమీటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, మాజేటి బ్రదర్స్, కంచర్ల బ్రదర్స్, నరేంద్ర, సతీష్, యానాం, పరిసర ప్రాంతాల మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

82 శాతం పింఛన్ల పంపిణీ



తాళ్లరేవులో 90 ఏళ్ల వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివ

తాళ్లరేవు: మండలంలో 82 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ చింతా మోహన్‌కృష్ణ తెలిపారు. మండలంలో 11,474 మంది పింఛనుదారులకు ఉండగా 9516 మందికి రూ.2.60 కోట్లు నగదు అందజేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. తొలిరోజు 82 శాతం పూర్తి చేశారు.

నేడు పోలీసులకు ఫిట్‌నెస్ పరీక్ష

యానాం: పుదుచ్చేరి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎల్ అండ్‌ఓ) దీపిక ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం యానాం నియోజకవర్గంలో పని చేసే పోలీసులకు, పోలీసు అధికారులకు శారీరక ధారుఢ్య పరీక్షలు ట్రాఫిక్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్నట్టు బుధవారం సీఐ గూటం శివగణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు పోలీసులు అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో పరీక్షలు చేస్తున్నారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా, బుద్ధివికాసపరంగా మంచి ఫిట్‌నెస్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, ×బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ)ను చేపట్టినట్టు తెలిపారు. మళ్లీ ఏప్రిల్ ఒకటిన వార్షిక రహస్య నివేదికలో వ్యక్తిగత పురోగతిని నమోదు చేస్తామన్నారు.

శాకాహార ప్రచార యాత్ర

యానాం: మాంసాహారం వద్దంటూ శాకాహారం, అల్పాహారం ప్రాధాన్యతను తెలుపుతూ మహాకరుణ్య ధ్యాన శాకాహార ప్రచార యాత్రను యానాం పిరమిడ్ సేవా దళ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం వల్ల అనేక లాభాలు ఉన్నాయని ఆవిధంగా శారీరక, మానసిక, అనారోగ్యాలు నివారణతోపాటు ఆత్మ విశ్వాసం, ధైర్యం వంటివి అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు టేకుమూడి వెంకట్రావు, ముకుందకుమార్, అన్నం రామకృష్ణ, జ్యోతి, సావిత్రి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఐ పోలవరం: సామాజిక, ఆర్థిక భద్రతలేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 3న గన్నవరం సమీపంలో సుందరయ్య విద్యానగర్‌లోని ధర్నస్థలిలో సంకల్ప దీక్ష నిర్వహించనున్నారు. ఈ దీక్షను జయప్రదం చేయాలని యూటీఎఫ్ ఐ.పోలవరం మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గంటా సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సంకల్పదీక్షకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఆనాడు ముఖ్యమంత్రి జగన్ ప్రకటించినట్టు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు.

వైభవంగా కాలభైరవస్వామి తీర్థం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాలభైరవస్వామివారు



కాలభైరవస్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- 10 వేల మందికి అన్నదానం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ సెంటర్ ప్రాంతంలో ఉన్న కాలభైరవ స్వామివారి తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ తీర్థం ఏడు గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని వెండి ఆభరణాలు, గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. అంగడి దుకాణాలు, అప్పన్నెద్దులతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు పది వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఏడు గ్రామాల పెద్దలు, గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఉమామహేశ్వరి, లక్ష్మీనారాయణుల కల్యాణం

స్థానిక రత్సవారి పేటలోని సత్యకామేశ్వరి సత్సంగ మందిరంలో బుధవారం ఉమామహేశ్వరి, లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు మర్ల హరిబాబు ఆధ్వర్యంలో గణపతి, లక్ష్మీనారాయణ హోమాలు, మహాదాశీర్వచనం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజను భక్తిశ్రద్ధలతో జరిపించారు. రత్స రామరావు, దుర్గామల్లేశ్వర వృద్ధుల బాలల ఆశ్రమం ప్రతినిధులు సంగాడి రాంబాబు, పితాని శ్రీకృష్ణ, విత్తనాల కరిమిల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న ప్రకాష్ దంపతులు

అల్లవరం: భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని కొమరగిరిపట్నం శివారు యడ్లరేవులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. పసలపూడి ప్రకాష్ ఆధ్వర్యంలో 35 మంది దంపతులచే స్వామివారి కల్యాణం రమణీయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భీష్మ ఏకాదిశి సందర్భంగా అల్లవరం, గోపాయిలంక, బెండమూర్లంక గ్రామాల్లో ఏకాహం నిర్వహించారు.

భీష్మ ఏకాదశి పూజలు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో రామాలయంలో జరుగుతున్న మహా సౌరయాగంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. యాగ కర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్ర మూర్తికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం సౌరయాగంలో హోమాలు, జపాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- మంత్రి పినిపే విశ్వరూప్
- పాలగుమ్మిరేవులో గడపగడపకూ మన ప్రభుత్వం



పాలగుమ్మిలో మహిళకు పథకాలు వివరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం పాలగుమ్మి రేవులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రెండో రోజు ప్రధాన వీధుల్లో ఇంటింటికీ వెళ్లి మంత్రి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడున్నరేళ్లల్లో ప్రవేశపెట్టిన పథకాలను వివరించి, వాటి ద్వారా పొందిన లబ్ధిని తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు పాలగుమ్మి విజయవాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్‌రెడ్డి సత్య నాగేంద్రమణి, నాయకులు కాట్రు చంద్రమోహన్, ఉప సర్పంచ్ కాట్రు వంసతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

తాళ్లరేవు: టెన్త్ పరీక్షలకు సంబంధించి జిల్లా ప్రజా పరిషత్ రూపొందించిన జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ విద్యార్థులకు అందజేసారు. బుధవారం చొల్లంగి, చొల్లంగిపేట, గురుకుల పాఠశాల, తాళ్లరేవు, జి.వేమవరం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. టెన్త్ విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలలో నాయకులు రాయుడు గంగాధర్, బూరెల వెంకట్రాజు, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీను, మట్టా లింగమూర్తి, దెయ్యాల సత్తిబాబు, కడియాల శ్రీను, గగ్రే సాయిలక్ష్మి, ఆయా హైస్కూల్స్ హెచ్ఎంలు, పీఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

పందులకు స్వైన్ ఫీవర్ టీకాలు



పందులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయారెడ్డి బృందం

అమలాపురం టౌన్: పట్టణం, రూరల్ మండలంలో వైరస్ బారినపడి చనిపోతున్న నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అప్రమత్త చర్యలను కొనసాగిస్తోంది. వైరస్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ఆరోగ్యంగా ఉన్న పందులకు స్వైన్ ఫీవర్ టీకాలు వేస్తోంది. పట్టణంతోపాటు రూరల్ మండలం పేరూరు, వన్నె చింతలపూడి తదితర గ్రామ ప్రాంతాల్లో పందుల పెంపకం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతాలకు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం క్షేత్ర స్థాయికి వెళ్లి పందులకు స్వైన్ ఫీవర్ రాకుండా టీకాలు ఇచ్చారు. 208 పందులను పరీక్షించి టీకాలు వేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి పందికి ఈ టీకా వేయించాలని పెంపకందార్లకు డాక్టర్ విజయారెడ్డి సూచించారు. పందుల మందలో నీరసంగా ఉండి వైరస్ బారిన పడ్డట్టు అనుమానం వచ్చిన పందులను తక్షణమే ఆ మంద నుంచి తప్పించి వేరే చోట వాటిని ఉంచుతున్నారు. ఆయా ప్రాంతాల పెంకపందారులు దగ్గరలో ఉండే రైతు భరోసా కేంద్రాల్లో పశు వైద్య సహాయకులను సంప్రదించాలని సూచించారు. పశు వైద్యులు డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ సాహిత్య పశు వైద్య సహాయకుడు వెంకటేష్‌తో కూడిన వైద్య బృందం ఈ టీకాలు వేసింది. ఈ కార్యక్రమాల్లో వన్నె చింతలపూడి గ్రామ సర్పంచ్ నక్కా రాజరత్న నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పందులకు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు

అల్లవరం: పందుల్లో మరణాలు నివారించేందుకు వ్యాధి నివారణ టీకాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాకులు విజయారెడ్డి బుధవారం తెలిపారు. ఏడీ విజయారెడ్డి ఆధ్వర్యంలో కొమరగిరిపట్నంలో పందులకు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పందుల పెంపకందారులు పందులపై జాగ్రత్తలు పాటించాలని, పందులు పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి నారాయణరావు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం రాక

యానాం: పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు వి.వైద్యలింగం ఈ నెల 6వ తేదీన యానాం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన షెడ్యులు వివరాలతో కూడిన ప్రకటనను ప్రైవేట్ కార్యదర్శి ఎంఆర్ సంపత్‌కుమార్ విడుదల చేశారు. ఆరోజు ఉదయం 6 గంటలకు చెన్నై విమానాశ్రయం బయలుదేరి 8.45కు రాజమండ్రికి చేరుకుంటారని అక్కడ నుంచి 10.30కు యానాం చేరుకుంటారని తెలిపారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ స్కూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) ఆధ్వర్యంలో జరిగే ఫిట్ ఇండియా కార్యక్రమంలో పాల్గొంటారని, ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేసి తిరిగి పుదుచ్చేరి పయనమవుతారన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన

యానాం: సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణపై బుధవారం స్థానిక మదర్ థెరిస్సా నర్సింగ్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ చంద్రాలక్ష్మి మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ నివారించడానికి ఉపకరించే వైద్యవిధానాలను వివరించారు. భారత్‌తో సహా అనేక దేశాల్లో మహిళలు ఎక్కువగా గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వైద్యం ద్వారా ఆక్యూపంచర్, ఆక్యూప్రెజర్, మ్యాగ్నెట్ థెరిపీ, యోగాసనాలు సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ఎంతగా మేలు చేస్తాయో వివరించారు. కళాశాల ట్యూటర్ జి.విజయలక్ష్మి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.